అదానీపై అరెస్ట్ వారెంట్

అదానీతో చీకటి ఒప్పందాలు బయటపెట్టాలి

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికే అవమానంతోపాటు అరిష్టమని కేటీఆర్ స్పష్టం చేశారు. రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపిండో, మూసీలో అదానీ వాటా ఎంతో నిగ్గుతేల్చాలని ఆయన ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. 'అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు. భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడు. ఇలాంటి మోసగాడికి.. దగాకోరుకా? తెలంగాణలో పెట్టుబడుల అనుమతులు' అని ఆయన నిప్పులు చెరిగారు. రామన్నపేటలో తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్నీ బయట పెట్టాలన్నారు. తెలంగాణ ఆస్తులను కొల్లగొట్టే కుయుక్తుల్లో భడే భాయ్ వాటా ఎంత? అదానీ భాయ్ వాటా ఎంత? హైకమాండ్ వాటా ఎంత? తేల్చాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని పరోక్షంగా ప్రశ్నించారు.

అదానీకి కెన్యా సర్కారు ఝలక్

లంచం ఆరోపణలపై అమెరికాలో కేసును ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీకి కెన్యా సర్కారు భారీ షాక్ ఇచ్చింది. 30 ఏండ్ల కోసమని అదానీ కంపెనీతో చేసుకొన్న విద్యుత్తు సరఫరా లైన్ల కాంట్రాక్టుతో పాటు జోమో కెన్యాట్టా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కాంట్రాక్ట్‌ను కూడా రద్దు చేసుకొంటున్నట్టు ఆ దేశాధ్యక్షుడు విలియం రూటో గురువారం తెలిపారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో కెన్యా సర్కారు 736 డాలర్లకు అదానీ కంపెనీతో విద్యుత్తు సరఫరా లైన్ల ఒప్పందాన్ని గతంలో చేసుకొన్న విషయం తెలిసిందే. ఇక, జోమో కెన్యాట్టా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును అదానీ గ్రూప్‌నకు అప్పగించవద్దంటూ ప్రజాందోళనలు వెల్లువెత్తడంతో ఈ నిర్ణయాన్ని ఇటీవలే ప్రభుత్వం తాత్కాలికంగా పక్కనబెట్టింది. తాజాగా ఈ రెండు ప్రాజెక్టులను రద్దు చేసింది.

నూతన కాగ్‌గా సంజయ్ మూర్తి ప్రమాణం

ఈ పదవి చేపట్టిన తొలి తెలుగు అధికారి

న్యూఢిల్లీ: కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్)గా కే సంజయ్ మూర్తి చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ప్రమాణం చేయించారు. ఈ పదవిని చేపట్టిన తొలి తెలుగు అధికారి ఆయన. 1989 బ్యాచ్ హిమాచల్ ప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన సంజయ్ కేంద్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా పని చేశారు. కాగ్‌గా గిరీశ్ చంద్ర ముర్ము పదవీ కాలం బుధవారంతో ముగిసింది. ఆయన స్థానంలో సంజయ్‌ని నియమించినట్లు ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. సంజయ్ మూర్తి ఏపీలోని కోనసీమలో 1964 డిసెంబరు 24న జన్మించారు. ఆయన తండ్రి కేఎస్ ఆర్ మూర్తి కూడా ఐఏఎస్ అధికారి. సంజయ్ 2021 నుంచి కేంద్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా పని చేస్తున్నారు.

3 గంటలకుపైగా ఆలస్యమయ్యే విమానాల రద్దు!

న్యూఢిల్లీ: విమానాలు బయల్దేరే సమయం ముందుగా ప్రకటించిన దాని కన్నా మూడు గంటలకు పైగా ఆలస్యమయ్యే అవకాశం ఉన్నపుడు ఆ విమానాలను రద్దు చేయాలని పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు విమాన యాన సంస్థలను ఆదేశించారు. ఢిల్లీలో పొగ మంచు కమ్మేస్తున్న నేపథ్యంలో వైమానిక సంస్థల సన్నద్ధతపై గురువారం సమీక్షించారు.

మొదటిపేజీ తరువాయి...

సంబంధించి గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు, అదానీ గ్రీన్ ఎనర్జీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ సాగర్ అదానీతో పాటు మరో ఆరుగురిపై కేసులు నమోదవ్వడమే గాకుండా అరెస్టు వారెంట్ కూడా జారీ అయినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

అసలేం జరిగింది?

ప్రపంచ దేశాలు పునరుత్పాదక శక్తి రంగం వైపు అడుగులు వేస్తున్న క్రమంలో సౌర విద్యుత్తు రంగంలో పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టాలని అదానీ గ్రూప్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఎలాంటి పోటీ లేకుండా కాంట్రాక్ట్ టెండర్లను దక్కించుకొనేందుకు ఏపీ, ఒడిశా, తమిళనాడు, జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులకు అదానీ గ్రూప్ ప్రతినిధులు రూ. 2,238 కోట్ల మేర లంచాలు ఆఫర్ చేసినట్టు అమెరికా ఎఫ్‌బీఐ తన ఆరోపణల్లో వెల్లడించింది. తద్వారా వచ్చే 20 ఏండ్లలో కనిష్ఠంగా 2 బిలియన్ డాలర్లు లబ్ధి పొందేందుకు అదానీ గ్రూప్ ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఆరోపించింది. ఈ లంచం సొమ్మును సేకరించడానికి బ్యాంకులు, పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారం ఇచ్చి మోసపుచ్చే ప్రయత్నాలు చేసినట్టు తెలిపింది. అమెరికా ఫెడరల్ కోర్టులో అదానీకి సంబంధించి ముఖ్యంగా రెండు అభియోగాలు నమోదైనట్టు అంతర్జాతీయ పత్రిక రాయిటర్స్ వెల్లడించింది. అందులో ఒకటి.. తప్పుడు సమాచారం చూపించి 2 బిలియన్ డాలర్ల మేర రుణాలకు అర్జీ పెట్టడం కాగా రెండోది.. అంతర్జాతీయ ఫైనాన్షియల్ సంస్థలు ఇచ్చిన భరోసాను చూపించి అమెరికాతో పాటు ఇతర దేశాల్లోని మదుపర్లకు 1 బిలియన్ డాలర్ల విలువైన బాండ్లను ఆఫర్ చేయడం. ఈ రెండు అభియోగాలపై న్యూయార్క్‌లోని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ కోర్టు అదానీ సహా ఏడుగురికి నోటీసులు జారీ చేసింది. మరోవైపు, ఫెడరల్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించిన కారణంగా గౌతమ్ అదానీ, సాగర్ అదానీతో పాటు ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న అజురా పవర్ అనే కంపెనీకి కూడా ఇదే కేసులో తాము నోటీసులు పంపించినట్టు యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా, ఈ కేసులో నిందితులు ఎఫ్‌బీఐ, ఎస్ఈసీ దర్యాప్తును అడ్డుకోవడానికి కుట్ర పన్నినట్టు కోర్టు ఈ సందర్భంగా పేర్కొనడం గమనార్హం.

ఎఫ్‌సీపీఏ చట్టం ఉల్లంఘన?!

అదానీ గ్రూప్ తాజా వ్యవహారం అమెరికాలోని ఫారెన్ కరప్ట్ ప్రాక్టిసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) చట్టం ఉల్లంఘన కిందకే వస్తుందని అక్కడి న్యాయకోవిదులు చెప్తున్నారు. అమెరికా కంపెనీలు, వ్యక్తులు విదేశాల్లో అవినీతి పనుల్లో భాగం కాకుండా చూడటమే ఈ చట్టం లక్ష్యం. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే అమెరికాలో తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు.

నిరాధార ఆరోపణలు

తమపై వచ్చిన ఆరోపణలను అదానీ గ్రూప్ ఖండించింది. అమెరికా ప్రాసిక్యూటర్లు చేస్తున్న ఆరోపణలన్నీ నిరాధారమైనవని, దీనిపై న్యాయపరంగానే ముందుకు వెళ్తామని వెల్లడించింది. దోషులుగా రుజువయ్యేవరకూ నిందితులను నిర్దోషులుగానే చూడాల్సి ఉంటుందని పేర్కొంది. చట్టాలను గౌరవిస్తూ, వాటికి లోబడి నడుచుకొంటున్నట్టు ఉద్ఘాటించింది.

ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ రద్దు

అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్, ఎస్ఈసీ అభియోగాల నేపథ్యంలో.. అమెరికా డాలర్ డినామినేటెడ్ బాండ్ ఆఫరింగ్‌లో ముందుకు వెళ్లకూడదని నిర్ణయించుకొన్నట్టు అదానీ గ్రూప్‌కు చెందిన అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ తెలిపింది. ఈ మేరకు ఈ విషయాన్ని గురువారం స్టాక్ మార్కెట్‌కు అందజేసిన ఫైలింగ్‌లో వెల్లడించింది. ఈ ఆఫర్ విలువ 600 మిలియన్ డాలర్లుగా ఉన్నట్టు పారిశ్రామిక నిపుణులు వెల్లడించారు. కాగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ 20 వేల కోట్ల ఎఫ్‌పీవోకు వెళ్లే సమయంలోనే జనవరి 25, 2023లో హిండెన్‌బర్గ్.. అదానీ గ్రూప్‌పై అవినీతి ఆరోపణలు చేయడం గమనార్హం. దీంతో ఆ ఎఫ్‌పీవోను కంపెనీ రద్దు చేసుకొంది.

అభియోగం ఏంటి: పోటీ లేకుండా సోలార్ కాంట్రాక్ట్‌ల కోసం అధికారులకు భారీఎత్తున లంచాలు

ఎవరిపై అభియోగం? గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్‌తో పాటు మరో ఆరుగురు (వినీత్ జైన్, రంజిత్ గుప్తా, సైరిల్ కబానిస్, సౌరబ్ అగర్వాల్, దీపక్ మల్హోత్రా, రూపేశ్ అగర్వాల్)

లంచాలు ఎంత మేరకు ఇవ్వాలనుకున్నారు? 2,238 కోట్లు

ఇంకేం చేశారు: లంచం డబ్బుల కోసం బ్యాంకులు, ఇన్వెస్టర్లకు బురిడీ

స్కామ్‌లో ఏయే రాష్ట్రాల అధికారులు? ఏపీ, ఒడిశా, తమిళనాడు, జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్

నిందితులు ఏది ఆశించారు? సోలార్ ప్రాజెక్టులు చేజిక్కించుకోవడం ద్వారా వచ్చే 20 ఏండ్లలో కనిష్ఠంగా 2 బిలియన్ డాలర్లు ఆర్జించవచ్చని భావించారు.

అమెరికా జోక్యం ఎందుకు?

ఎఫ్‌బీఐ తాజాగా పేర్కొన్న రెండు అభియోగాల్లో ఎనిమిది మంది కీలక నిందితుల్లో నలుగురికి అమెరికా పౌరసత్వం ఉన్నట్టు తెలుస్తున్నది. అంతేకాకుండా ఈ స్కామ్‌లో అమెరికా ఇన్వెస్టర్ల నిధులు కూడా ఉన్నాయి. ఎస్ఈసీ నోటీసులు జారీ చేసిన అజురా పవర్ కంపెనీ న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో (ఎన్‌వైఎస్ఈ) లిస్ట్ అయ్యి ఉన్నది. ఈ క్రమంలోనే ఈ కేసు విచారణను అమెరికా కోర్టు ప్రారంభించింది.

ఈ వ్యవహారం ఎలా బయటపడింది?

22 నెలల కిందట అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ గ్రూప్ కంపెనీల్లో స్టాక్ మ్యానిప్యులేషన్ జరిగినట్టు సంచలన ఆరోపణలు చేసింది. షెల్ కంపెనీలను సృష్టించి షేర్ ముఖ విలువలను పెంచారని అభియోగాలు నమోదు చేసింది. దీనిపై అమెరికాలోని బ్రూక్లిన్ జిల్లా కోర్టులో ఇంకా విచారణ కొనసాగుతున్నది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన కొందరు న్యాయవాదులకు సోలార్ ఎనర్జీ కాంట్రాక్టు టెండర్లలోనూ అక్రమాలు జరిగినట్టు అనుమానాలు వచ్చాయి. దీంతో వాళ్లు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు అక్కడి స్థానిక మీడియా వెల్లడించింది.

అమెరికాకు అప్పగించాలా?

గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన నేరారోపణలు రుజువైతే ఆయన్ని భారత్.. అమెరికాకు అప్పగిస్తుందా? అనే చర్చ పెద్దయెత్తున జరుగుతున్నది. ఇండియా-అమెరికా మధ్య వాషింగ్టన్‌లో జూన్ 25, 1997లో నేరస్తుల అప్పగింత ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం.. అమెరికాలో నమోదైన అభియోగాలు నిరూపితమైతే నిందితులు అక్కడే శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నేరం రుజువైతే అదానీని అమెరికాకు భారత్ అప్పగించాల్సి వస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రుజువైతే ఏ శిక్ష పడొచ్చు?

అదానీ గ్రూప్ అక్రమాలు నిజమేనని తేలితే ఎఫ్‌సీపీఏ చట్టం ప్రకారం.. గౌతమ్ అదానీకి ఐదేండ్ల జైలు శిక్షతో పాటు 2 మిలియన్ డాలర్ల జరిమానా విధించవచ్చు. ఈ మేరకు 2008నాటి సీమెన్స్ ఏజీ, 2012లో ఎలీలిల్లీ ఫార్మా కంపెనీ తదితర కేసులను నిపుణులు ఉదహరిస్తున్నారు.

ప్రపంచ ఆర్థిక వేదికలో అదానీతో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న సీఎం రేవంత్ రెడ్డి (ఫైల్)

అదానీతో అంటకాగిన అందరికీ శిక్ష పడాలి: రాహుల్

లంచం ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైన గౌతమ్ అదానీని వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఈ క్రమంలో ఓ టీవీ చానల్ మహిళా యాంకర్ రాహుల్‌ను ప్రశ్నించారు. 'మీ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అదానీ కంపెనీతో దావోస్ వేదికగా రూ. 2,400 కోట్ల ఎంవోయూ చేసుకొంది. దీనిపై ఏమంటారు? అదానీ డీల్‌తో మీ పార్టీ ఏ సందేశం ఇస్తుంది' అని ప్రశ్నించారు. దీనికి రాహుల్ సమాధానమిస్తూ.. 'అదానీ అరెస్టవ్వాలి. ఆయనతో అంటకాగిన వాళ్లెవరైనా.. ఏ పార్టీ వారైనా.. శిక్ష ఎదుర్కోవాలి' అని బదులిచ్చారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.. 'లంచం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సరే.. అది బీజేపీ అయినా, మరే ఇతర పార్టీ అయినా.. విచారణ జరిపించాల్సిందే' అని డిమాండ్ చేశారు. కాగా, దావోస్ వేదికగా రేవంత్ ప్రభుత్వం అదానీ కంపెనీతో రూ. 12,400 కోట్ల పెట్టుబడుల ఒప్పందం చేసుకొంది. అనంతరం స్కిల్ యూనివర్సిటీ కోసం అదానీ గ్రూప్ రూ. 100 కోట్ల విరాళం ప్రకటించడం చర్చనీయాంశమైంది. అదానీ వ్యవహారంపై ప్రధాని స్పందించాలని తృణమూల్ నేత కునాల్ ఘోష్ డిమాండ్ చేశారు. సీబీఐ విచారణ జరపాలని సీపీఎం పేర్కొన్నది. పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తుతామని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. ఆరోపణలపై ఆదానీ సంస్థనే సమాధానం ఇచ్చుకోవాలని, చట్టం తన పని తాను చేస్తుందని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర పేర్కొన్నారు.

ఇటీవలి కాలంలో అదానీ గ్రూప్ ఎదుర్కొన్న ప్రధాన అభియోగాలు, నిరసనలు

- **2024 (సెప్టెంబర్):** నైరోబీ ఎయిర్‌పోర్ట్, కెన్యా
  30 ఏండ్లపాటు ఎయిర్‌పోర్ట్‌ను అదానీ గ్రూప్‌కు ఇవ్వాలని కెన్యా సర్కారు నిర్ణయం. స్థానికుల ఆందోళనతో రద్దు.
- **2023(డిసెంబర్):** ధారావి అభివృద్ధి ప్రాజెక్టు, ముంబై
  ధారావిలో పూరి గుడిసెలను తొలగించి పక్కా నిర్మాణాలు చేస్తామని అదానీ గ్రూప్ హామీ. తమ భూములను లాక్కోవడానికేనంటూ స్థానికుల నిరసనలు.
- **2023 (ఆగస్టు):** ఓసీసీఆర్పీ నివేదిక
  అదానీ కుటుంబ సభ్యులు విదేశాల్లోని నిధులతో అదానీ షేర్ల విలువను పెంచారంటూ ఓసీసీఆర్పీ నివేదిక.
- **2023 (జనవరి):** హిండెన్‌బర్గ్ రిపోర్ట్
  అదానీ గ్రూప్ కంపెనీల్లో స్టాక్ మ్యానిప్యులేషన్, షేర్ల ముఖవిలువ పెంపు వంటి అవకతవకలు జరిగాయంటూ హిండెన్‌బర్గ్ సంచలన నివేదిక.
- **2022:** శ్రీలంక పవర్ ప్రాజెక్టు
  శ్రీలంకలో అదానీకి పవర్ ప్రాజెక్టులు కట్టబెట్టడానికి ప్రధాని మోదీ ఒత్తిడి తీసుకొచ్చారని అప్పటి లంక ప్రభుత్వంలో కీలకాధికారి ప్రకటించడం, అనంతరం నిరసనలు.
- **2017:** ఆస్ట్రేలియాలో 11 బిలియన్ డాలర్లతో కోల్ మైన్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుతో గ్రేట్ బారియర్ రీఫ్ దీవుల్లో జీవజాలానికి ప్రమాదమని నిరసనలు వ్యక్తమయ్యాయి. జార్ఖండ్‌లోని గొడ్డాలో అదానీ పవర్ ప్లాంట్ ఏర్పాటు. బంగ్లాదేశ్‌తో విద్యుత్తు ఒప్పందంపై కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి.

డ్నిప్రోలో క్షిపణి దాడికి గురైన ఓ భవనంలో మంటలు ఆర్పుతున్న ఫైర్ ఫైటర్స్

ఉక్రెయిన్‌పై ఖండాంతర క్షిపణి

- తొలిసారి ప్రయోగించిన రష్యా
- ఉక్రెయిన్, పాశ్చాత్య దేశాలకు 'అణుదాడి' హెచ్చరికలు
- రష్యాపై 'స్టార్మ్ షాడో' క్షిపణులతో ఉక్రెయిన్ దాడి

కీవ్/మాస్కో, నవంబర్ 21: రష్యా - ఉక్రెయిన్ యుద్ధం తీవ్రరూపం దాలుస్తున్నది. ఇరు దేశాలు పరస్పరం క్షిపణులతో దాడులు చేసుకుంటున్నాయి. యుద్ధం ప్రారంభమైన తర్వాత మొదటిసారిగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి(ఐసీబీఎం)తో ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసింది. డ్నిప్రో నగరాన్ని లక్ష్యంగా చేసుకొని బుధవారం రాత్రి ఈ దాడి జరిగినట్టు ఉక్రెయిన్ వెల్లడించింది. మరో ఎనిమిది ఇతర క్షిపణులతోనూ రష్యా దాడి చేసిందని, వీటిల్లో ఆరు క్షిపణులను కూల్చేశామని పేర్కొన్నది. ఈ దాడిలో ఇద్దరు పౌరులు గాయపడ్డట్టు తెలిపింది. రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడి చేసేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అనుమతి ఇచ్చినందుకు ప్రతిస్పందనగా ఐసీబీఎంను రష్యా వినియోగించింది. అణ్వాయుధాలను మోసుకెళ్లేలా ఈ ఖండాంతర క్షిపణులను తయారుచేశారు. ఇప్పుడు సాధారణ బాంబుతోనే దాడి చేసినప్పటికీ, అణుదాడి సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకే రష్యా ఈ క్షిపణిని వినియోగించినట్టు స్పష్టమవుతున్నది. కాగా, తాము దాడి చేసింది ఐసీబీఎంతో కాదని, మధ్యశ్రేణి హైపర్‌సోనిక్ క్షిపణితో దాడి చేసినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌లోని మిలిటరీ కేంద్రంపై దాడి చేసినట్టు చెప్పారు. రష్యాకు వ్యతిరేకంగా వాడే ఆయుధాలు కలిగిన ఏ దేశం మిలిటరీ కేంద్రంపై అయినా దాడి చేయగలమని ఆయన హెచ్చరించారు.

'స్టార్మ్ షాడో'తో ఉక్రెయిన్ దాడులు

ఉక్రెయిన్ సైతం రష్యాపై దాడులు ముమ్మరం చేసింది. దీర్ఘశ్రేణి క్షిపణుల వినియోగానికి అమెరికా, యూకే అనుమతించడంతో ఆయా దేశాల్లో తయారైన క్షిపణులతో రష్యాపై దాడికి దిగుతున్నది. ఇప్పటికే అమెరికాలో తయారైన ఏటీఏసీఎంఎస్ క్షిపణులను వినియోగించిన ఉక్రెయిన్.. బ్రిటన్‌లో తయారైన రెండు 'స్టార్మ్ షాడో' క్షిపణులతో గురువారం రష్యాపై దాడి చేసింది. ఈ రెండు క్షిపణులతో పాటు ఆరు హిమార్స్ రాకెట్లు, 67 డ్రోన్లను కూల్చేసినట్టు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది.

అనారోగ్యంతో రష్యా అధ్యక్షుడు పుతిన్?

ఒకవైపు రష్యా - ఉక్రెయిన్ మధ్య యుద్ధం తీవ్రమవుతుండగా, మరోవైపు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కొన్ని రోజులుగా బయటకు కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. 72 ఏండ్ల పుతిన్ గత 13 రోజులుగా బయటకు కనిపించడం లేదు. నవంబరు 7 నుంచి జరిగిన ఏ కార్యక్రమానికీ ఆయన హాజరుకాలేదు. దీంతో ఆయన ఆరోగ్యంపై వదంతులు వ్యాపిస్తున్నాయి. అయితే, ప్రస్తుతం పుతిన్‌కు సాధారణ వైద్య చికిత్స జరుగుతున్నట్టు రష్యాకు చెందిన మీడియా సంస్థ ఏజెంట్‌స్వో వెల్లడించింది. క్యాన్సర్, పార్కిన్సన్స్ వ్యాధులతో పుతిన్ బాధపడుతున్నారని గత కొన్నేండ్లుగా ప్రచారాలు ఉన్నాయి.

నిజ్జర్ హత్య వెనుక మోదీ హస్తం!

- ప్రధాని ఆమోదంతోనే వేర్పాటువాది హతం
- హత్యకు కుట్ర చేసింది హోం మంత్రి అమిత్ షా
- నిర్ధారణకు వచ్చిన అమెరికా, కెనడా ఇంటెలిజెన్స్
- కెనడా పత్రికతో ఆ దేశ భద్రతా అధికారి ఆరోపణ
- హాస్యాస్పదమని భారత విదేశాంగ శాఖ ఖండన

టొరంటో, నవంబర్ 21: సిక్కు వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత ప్రధాని మోదీతోపాటు పలువురు ప్రముఖుల హస్తం ఉన్నదని కెనడాకు చెందిన భద్రతా సంస్థలు ఆరోపించాయని ఆ దేశ దినపత్రిక 'ది గ్లోబ్ అండ్ మెయిల్' ఒక వార్తా కథనాన్ని ప్రచురించింది. కెనడాలో నివసిస్తున్న మరికొందరు వేర్పాటువాదులను కూడా నిర్మూలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు పేర్కొన్నది. ఇప్పటికే భారత్, కెనడా మధ్య దౌత్య సంబంధాలు అంతంత మాత్రం ఉండగా, ఈ వార్తా కథనం దానికి మరింత ఆజ్యం పోసింది. అయితే ఆ వార్తాకథనం హాస్యాస్పదం అంటూ భారత్ తోసిపుచ్చింది.

ఉన్నతస్థాయి చర్చల తర్వాతే నిజ్జర్ హత్య!

కెనడా పత్రిక కథనం ప్రకారం.. నిజ్జర్ హత్యకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కుట్ర పన్నారని, ఈ విషయాన్ని మోదీతో పాటు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు సమాచారం ఇచ్చారని కెనడా జాతీయ భద్రతా అధికారి ఒకరు తెలిపారు. భారత ప్రభుత్వంలోని ఉన్నతస్థాయి వ్యక్తుల మధ్య చర్చలు జరిగిన తరువాతనే నిజ్జర్ హత్య చోటుచేసుకున్నట్టు కెనడా భద్రతా సంస్థలు భావిస్తున్నాయని ఆ అధికారి పేర్కొన్నారు. నిజ్జర్ హత్యలో మోదీతోపాటు జైశంకర్, అజిత్ దోవల్ పాత్ర ఉన్నట్టు ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి. ప్రధాని మోదీకి తెలియకుండా ఓ పరాయి దేశంలో ముగ్గురు సీనియర్ రాజకీయ ప్రముఖులు హత్యకు కుట్ర చేశారనుకోవడం నమ్మశక్యం కానిదని ఆ భద్రతా అధికారి అభిప్రాయపడ్డారు. నిజ్జర్ హత్య వెనుక మాస్టర్ మైండ్ అమిత్‌షాదేనని అటు అమెరికా, ఇటు కెనడా ఇంటెలిజెన్స్ వర్గాలు నిర్ధారణకు వచ్చినట్టు ఆ అధికారి తెలిపారు.

మరో 13 మంది హత్యకు ప్లాన్!

కెనడాకు చెందిన బ్రిటిష్ కొలంబియాలోని సర్రేలో గత ఏడాది జూన్‌లో ఓ గురుద్వారా నుంచి వెలుపలికి వచ్చిన నిజ్జర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. నిజ్జర్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తుల హత్య వెనుక భారత్ పాత్ర ఉన్నట్టు రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ కమిషనర్ (ఆర్సీఎంపీ) మైక్ డ్యుహీమ్ ఆరోపించారు. మరో 13 మందికి ప్రాణహాని పొంచి ఉన్నదని, వారిని మట్టుబెట్టేందుకు భారత్ చేపడుతున్న చర్యల నుంచి వారిని కాపాడటం తమ భద్రతా సంస్థల వల్ల కాదని వ్యాఖ్యానించారు. ఈ విషయంపై చర్చించేందుకు ఆర్సీఎంపీ బృందం అక్టోబర్ 8న ఢిల్లీ వెళ్లిందని, కానీ దౌత్యపరమైన సాంకేతిక కారణాలు చూపుతూ ఆ సమావేశం జరుగకుండా భారత్ అడ్డుకున్నదని చెప్పారు. ఆ తరువాత అక్టోబర్ 12న సింగపూర్‌లో ఆ సమావేశం జరిగిందని, కెనడాకు చెందిన విదేశాంగ శాఖ ఉప మంత్రి డేవిడ్ మారిసన్, ఆర్సీఎంపీ అధికారి మార్క్ ఫ్లిన్, భారత్ నుంచి అజిత్ దోవల్ హాజరయ్యారని తెలిపారు. ఆ సందర్భంగా తాము చూపిన అనేక సాక్ష్యాధారాలను దోవల్ తోసిపుచ్చారని వివరించారు. మూడురోజుల క్రితం బ్రెజిల్‌లోని రియో డి జెనీరోలో జరిగిన జీ20 సమావేశాల సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.. కెనడా ప్రధాని ట్రూడో, ప్రధాని మోదీతో ప్రత్యేకంగా సమావేశమై ఇదే అంశంపై చర్చించారని కెనడా పత్రిక పేర్కొంది. ఇదిలా ఉండగా, న్యూయార్క్‌కు చెందిన ఖలిస్థాన్ వేర్పాటువాది గుర్‌పత్వంత్‌సింగ్ పన్నున్‌ను హత్య చేసేందుకు కుట్ర పన్నాడన్న ఆరోపణపై అమెరికా పోలీసులు వికాశ్ యాదవ్ అనే వ్యక్తిని మన్‌హట్టన్ కోర్టులో హాజరుపరిచారు. వికాశ్‌యాదవ్ భారత గూఢచార సంస్థ రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) అధికారి అని అమెరికన్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.

ఆ కథనం హాస్యాస్పదం

పేరు చెప్పడానికి నిరాకరించిన ఓ కెనడా అధికారి చెప్పాడంటూ గ్లోబ్ అండ్ మెయిల్ పత్రిక ప్రచురించిన కథనాన్ని భారత విదేశాంగ శాఖ ఖండించింది. ఇలాంటి హాస్యాస్పదమైన కథనాలను తోసిపుచ్చుతున్నామని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం పేర్కొన్నారు. సాధారణంగా పత్రికా కథనాలపై తాము స్పందించబోమని, కానీ ఓ కెనడా ప్రభుత్వ అధికారి చెప్పాడంటూ ప్రచురితమైన హాస్యాస్పద కథనంపై స్పందించక తప్పడం లేదని అన్నారు. ఇప్పటికే ఉభయ దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలు ఇటువంటి కథనాల వల్ల మరింత ధ్వంసమవుతాయని పేర్కొన్నారు.

నెతన్యాహూపై అరెస్టు వారెంట్

జారీ చేసిన ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు

హమాస్ అధికారులపైనా వారెంట్ జారీ

హేగ్, నవంబర్ 21: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూపై ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు(ఐసీసీ) అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆయనతో పాటు ఇజ్రాయెల్ మాజీ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లెంట్, హమాస్ అధికారులపైనా గురువారం అరెస్టు వారెంట్‌లు జారీ చేస్తున్నట్టు ప్రకటించింది. గాజాలో చేస్తున్న యుద్ధంలో యుద్ధనేరాలకు, మానవతా వ్యతిరేక నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో నెతన్యాహూ, గల్లెంట్‌పై, 2023 అక్టోబరులో ఇజ్రాయెల్‌పై దాడికి పాల్పడినందున హమాస్ అధికారులపై ముగ్గురు సభ్యుల ధర్మాసనం అరెస్టు వారెంట్లు జారీ చేసింది. కాగా, అరెస్టు వారెంట్లు జారీ చేసినప్పటికి, వాటిని అమలు చేసేందుకు ఐస